

# పసిడిమనసులు - షర్మిల



## నెలనెలా పసిడిమనసులు చెప్పే మనసైన కథలు..!

# మా మస్తాన్ వలీ మాస్టారు

తెల్లారడమే ఆలస్యం వూరిమీద తిరగడం తప్ప ఇంకో పని లేదు నాకు. అందరు పిల్లల్లా బడి పాడూ లేదు. ఇష్టమైతే వూరి బళ్లోకి లేకపోతే ఆచార్లు గారి అరుగు మీదకి పలక పుచ్చుకుని వెళ్లడం ఏదో నాకు తోచిన నాలుగు ముక్కలు నేర్చుకోవడం మిగతా టైము అంతా వూరు చుట్టడం ఇదే పని.

అలాగే మా వూరు చుట్టేటప్పుడు బాపమ్మ మామ్మ ఇంట్లో మా వూరి పెద్ద పిల్లలు ట్యూషన్ చదువుకుంటూ కనిపించారు. ఎదురుగా పడక్కుర్చీలో ఎర్రగా సన్నగా సూది ముక్కుతో పెద్ద కళ్లతో ఒకాయన పిల్లలికి ఇంగ్లీష్ పాఠాలు చెప్తున్నారు. మా ఆచార్లుగారి అరుగు మీద ఒక్క అ ఆలు, లెక్కలు, డిక్టేషన్ మాత్రమే చెప్తారు.

నేను ఆసక్తిగా కిటికీలోనుంచి చూస్తుండగా మాస్టారు నన్ను చూసి

“ పాపా ఇట్టారామ్మా !” అనడం ఆలస్యం వెళ్లి కూర్చుని సోది మొదలెట్టాను.

“'నీ పేరేంటి?” అనగానే

“అమ్ముడు” అన్నాను.

ఆయన నవ్వుతూ" నీకు ఇంగ్లీష్ వచ్చా? " అనగానే " ఓ” అన్నా.

పక్కన నాకన్నా పిల్లలు చెప్పలేని స్పెల్లింగులన్నీ చెప్పగానే ఆయన మురిసి పోయారు.

నేను ఏ బళ్లోనూ చదవడం లేదని తెలుసుకుని "రోజూ ఇక్కడికి రా అమ్ముడూ! నిన్ను చదివించి డైరెక్ట్ గా ఆరో తరగతిలో వేయిస్తా, రోజూ బోర్డ్ స్కూల్కి ఈలోగా వెళ్లాలి అంతేగాని ఇట్టా తిరగకూడదు " అన్నారు.

“మాస్టారు! మా ఇంటికి రండి” అని ఒకరోజు తీసికెళ్లాను.

చిట్టెమ్మతో మాస్టారు "మీ మనవరాలు చాలా చురుకైనదండీ ! మీరు కాస్త శ్రద్ధ గా చదివించండి " అనగానే మా చిట్టెమ్మ తెగ ఆనందపడి పోయి మాస్టారికి చిక్కటి కాఫీ ఇచ్చి తినడానికి ఏంటేంటో పెట్టింది. మాటల్లో తాను కూచిపూడి కళాక్షేత్రం హైస్కూల్లో డ్రిల్ మాస్టర్ గా వచ్చానని తన పేరు మస్తాన్ వలి అని పరిచయం చేసుకున్నారు. తనకు పెళ్లైందని ఈమధ్యే పాప పుట్టిందని చెప్పడంతో మా ఇంటిలో పక్కన వున్న గది వరండా వాళ్లకి సరిపోతుందని కొత్త కాపురం ఇక్కడే పెట్టుకోమని చెప్పేసింది. అంతే కాకుండా వాళ్లకి పాలు మా ఇంటినుంచే వస్తాయని దీనికి బదులుగా నాకు మా తమ్ముడికి చదువు చెప్పాలనడంతో మాస్టారు సరేనన్నారు.

ఆ రోజు నుంచి నేను మాస్టారి ప్రియ శిష్యురాలినయ్యాను. మా పంతులమ్మగారు చంటిపిల్లతో సహా బస్ దిగినప్పుడు నేను మాస్టారూ వెళ్లి దించుకున్నాం. మాస్టారి భార్యని పంతులమ్మగారు అనే పిలుస్తారు మా వూళ్లల్లో ... నేనంటే పంతులమ్మగారికీ ఇష్టమే .

మాస్టారు తెల్లారగట్ట నాలుగు గంటలకే “అమ్మడూ..” అని పిలవగానే ముఖంకడుక్కుని పుస్తకాలు తీసుకుని పక్క వాటాలోకి వెళ్లేదాన్ని . మాస్టారు డ్రిల్ మాస్టరైనా లెక్కలు బాగా చెప్పే వారు.

మొత్తానికి నా ఐదో తరగతి సిలబస్ చెప్పి ఆరో తరగతి ఎంట్రన్స్ రాయించడానికి సైకిల్ ఎక్కించుకుని తీసుకువెళ్తూ

" అమ్మడూ నీ పూర్తి పేరు చెప్తే స్కూల్ రికార్డుల్లో రాయిస్తాను " అన్నారు .

“మాస్టారూ ! నాపేరు షర్మిల అని రాయించండి , మా అమ్మ నాకు ఆ పేరు పెట్టాలనుకుంట కానీ మా తాతమ్మ మున్సబ్ దగ్గర పూజాలక్ష్మి అని రాయించేసిందంట. మా అమ్మ వాళ్లు నార్త్ ఇండియా లో వుంటారు కదా! ఈ సెలవలకు వచ్చినప్పుడే అమ్మ ఈ సంగతి చెప్పింది” అన్నాను.

అట్లా నా నామకరణం మా మస్తాన్ వలి మాస్టారి చేతుల మీదుగా జరిగింది .

నేను తరవాత మా తాత గారి వూరు వదిలేసినా మాస్టారు నా చదువు గురించి అడుగుతూనే వుండేవారు. ఆయన వూహించినంత స్థాయికి నేను ఎదగలేదనే బాధ నేను ఎప్పుడు కనిపించినా వ్యక్తమయ్యేది .

మాస్టారు వేరే వూరికి ట్రాన్స్ఫర్ అయ్యారు. ఆయన నలుగురుపిల్లలూ కూడా పెద్దవాళ్లయ్యారు.

నేను ఓసారి మావూరు వెళ్ళినప్పుడు మాస్టారింటికి వెళ్లాను.

ఆయన నన్ను కూర్చొబెట్టి “అమ్మడూ!” అని పిలిచారు.

" ఆ..” అని నేను పలికేలోగా ఇంకో గొంతు “వస్తున్నా "అంటూ వినిపించింది.

నేను ఆశ్చర్యంగా చూస్తుంటే మా పంతులమ్మగారు అన్నారు "అమ్మడూ ! నువ్వు వెళ్లి పోయాక నేను ,మీ మాస్టారు మా పెద్దమ్మాయి కాలేషా బేగం ని అమ్మడూ! అనే పిల్చుకుంటున్నాం. నువ్వూ మా బిడ్డవే.. అందుకే నిన్ను మీ మాస్టారు మర్చిపోలేదు " అంటుంటే నా కంట్లో సన్నగా నీరు కమ్మింది.

*(వచ్చేనెల మరో పసిడిమనసు కథ)*

COMMENTS